పల్స్ పోలియోపై శిక్షణ



పల్స్ పోలియో శిక్షణలో వైద్య, ఆరోగ్య సిబ్బంది

కీసర: మండల కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సరిత ఆధ్వర్యంలో ఆశ వర్కర్లతో పాటు ఆరోగ్య కార్యకర్తలకు పల్స్ పోలియో కార్యక్రమంపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. వచ్చేనెల 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని సరిత అన్నారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎమ్‌లకు యూనిఫాంలు, ఆశా కార్యకర్తలకు హెచ్‌బీఎన్‌సీ కిట్స్ అందించామన్నారు.

బాల్క సుమన్‌పై మేడ్చల్ పీఎస్‌లో ఫిర్యాదు



మేడ్చల్: సీఎం రేవంత్‌రెడ్డిని దూషించిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయకులు మేడ్చల్ పీఎస్‌కు ర్యాలీగా వెళ్లి స్టేషన్‌లో సుమన్‌పై ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వరదారెడ్డి, సంజీవరెడ్డి, పోచయ్య, రాజు, లింగం, శ్రీనివాస్‌గౌడ్, రఘుపతిరెడ్డి, నందు, నాగభూషణం, రామకృష్ణరెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇటెవరో.. అటెవరో..? ఎవరికి ఎరుక?



యానాంలో క్యాంపులో అసమ్మతి కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



గోవాలో కార్పొరేటర్లతో మేయర్ మేకల కావ్య

బీఆర్‌ఎస్‌లో వర్గపోరు

- రెండేళ్లుగా అవిశ్వాసం బాట
- మేయర్ వర్సెస్ డిప్యూటీ మేయర్
- బాపట్ల, గోవాలో క్యాంపులు
- మేయర్ స్థానంపై ఇద్దరి గురి
- కోట్లకు పడగెత్తిన మేయర్ పీఠం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ మేయర్ పీఠంపై కార్పొరేటర్ల కన్నుపడింది. దీంతో మేయర్ పీఠం కోట్లకు పడగెత్తింది. జవహర్‌నగర్ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేసి క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. ఇందులో భాగంగా డిప్యూటీ మేయర్‌తో సహా 17 మంది బాపట్ల, యానం ప్రాంతాల్లో అసమ్మతి కార్పొరేటర్లు క్యాంపు రాజకీయం చేస్తుండగా మేయర్ వర్గం 8 మందితో గోవా టూర్‌కు వెళ్లారు.

కార్పొరేటర్లకు బంపర్ ఆఫర్..

క్యాంపు రాజకీయాలతో కార్పొరేటర్లకు కాసుల పంట పండుతోంది. మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలని 18 మంది కార్పొరేటర్లు సంతకం పెట్టి క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. క్యాంపునకు వెళ్లిన అసమ్మతి కార్పొరేటర్లకు కొంత మేరకు ఆఫర్ ఇచ్చి కాపాడుతుండగా అంతకు రెట్టింపు ఇస్తామని మేయర్ వర్గం ప్రకటించడంతో అసమ్మతి వర్గం మాత్రం తాము తీసిపోమని, వారు ఎంత ప్రకటించినా అంతకు మించి ఆఫర్ ఇస్తామని కార్పొరేటర్లను బుజ్జగిస్తున్నారు. ధనబలంతో ఇరు వర్గాలు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే అసమ్మతి కార్పొరేటర్ల తరఫున దాదాపు రూ.3 కోట్లకు చేరినట్లు సమాచారం.

నలుగురు కార్పొరేటర్లకు ఎర..

అసమ్మతి వర్గంలో ఉన్న 18 కార్పొరేటర్లలో నలుగురికి మేయర్ వర్గం బంపర్ ఆఫర్ ప్రకటించింది. క్యాంప్‌లో భాగంగా బాపట్లకు వెళ్లిన కార్పొరేటర్లలో మరో ఇద్దరు మేయర్‌తో టచ్‌లో ఉన్నట్లు మేయర్ వర్గం ధీమా వ్యక్తం చేస్తోంది. అవిశ్వాసంలో ధోకా లేదని తామే అవిశ్వాసం నెగ్గుతామని స్పష్టం చేశారు.

పూర్తి మెజారిటీ ఉంది

క్యాంపునకు వెళ్లిన అసమ్మతి కార్పొరేటర్లు తమకు పూర్తి మద్దతు ఉందని ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పీఠాన్ని కై వసం చేసుకుంటామని డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.

14 రోజులు కాపాడేదెట్లా..?

క్యాంపునకు వెళ్లిన కార్పొరేటర్లను ఈ నెల 19 వరకు కాపాడాల్సి ఉంది. అసమ్మతి కార్పొరేటర్లు ఇప్పటికే 20 రోజుల నుంచి క్యాంపు రాజకీయం చేస్తుండగా ఆదివారం మేయర్ వర్గం గోవాకు వెళ్లారు. అటు.. ఇటువైపులా ఉన్న కొందరు కార్పొరేటర్లు మాత్రం వారి రేటు పెంచుతూ చుక్కలు చూపిస్తున్నారు. వారిని మచ్చిక చేసుకోవడానికి విందు, వినోదాలతో కాలం గడుపుతున్నారు. అయినప్పటికీ ఎవరు ఎటు వెళ్తారని ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి. 14 రోజుల్లో ఇంకా ఎన్ని గమ్మత్తులు జరుగుతాయో..? 19వ తేదీన కార్పొరేటర్లు ఎటువైపు నిలబడతారో..? మేయర్ పీఠం ఎవరిని వరిస్తుందో వేచిచూడాల్సిందే.

రోజుకో మలుపు..

జవహర్‌నగర్ అవిశ్వాసం రోజుకో మలుపు తిరుగుతోంది. రెండు రోజుల క్రితం మేయర్ 10వ డివిజన్‌కు చెందిన గండి రాంచందర్‌ను కిడ్నాప్ చేశారని అసమ్మతి, మేయర్ వర్గం ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం గండి రాంచందర్‌ను గోవాను తీసుకెళ్లారు. అక్కడి నుంచి సైతం కార్పొరేటర్ రాంచందర్ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. మేయర్, అసమ్మతి వర్గం పోటాపోటీగా హామీలు ఇస్తుండటంతో కార్పొరేటర్లకు కాసుల పంట పండుతోంది. ఎత్తులకు పైఎత్తులు వేసి కార్పొరేటర్లను మచ్చిక చేసుకోవాలని ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

28 మంది కార్పొరేటర్లు..

దాదాపు 3 లక్షల జనాభా ఉన్న జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 28 మంది కార్పొరేటర్లు, ఐదుగురు కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. వీరిలో మేయర్, డిప్యూటీ మేయర్‌తో కలిసి 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం 16వ డివిజన్ కార్పొరేటర్ విశ్రాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది.

కార్పొరేటర్లపై కాంగ్రెస్ కన్ను

జవహర్‌నగర్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి క్యాంపు రాజకీయాలకు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు తెరలేపడంతో ఆ పీఠాన్ని కై వసం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు వేచిచూస్తున్నారు. అసమ్మతిలో 18 మంది, మేయర్ వర్గం నుంచి 8 మంది కార్పొరేటర్లు ఉండగా కాంగ్రెస్ నుంచి 28వ డివిజన్‌కు చెందిన కారింగుల నిహారికగౌడ్ మాత్రమే ఉంది. ఈ అవిశ్వాసాన్ని అవకాశంగా మార్చుకోవాలని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర జంగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిలు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

హిందీ క్వశ్చన్ ఫోరమ్ కాంపిటీషన్



సిబ్బందితో సీఆర్‌పీఎఫ్ డీఐజీ జీసీ అనిల్‌మింజ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సీఆర్‌పీఎఫ్ ప్రాంగణంలో అధికార భాష కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హిందీ క్వశ్చన్ ఫోరమ్ కాంపిటీషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఆర్‌పీఎఫ్ డీఐజీ జీసీ అనిల్‌మింజ్ హాజరై మాట్లాడుతూ.. హిందీ భాషను అర్థం చేసుకుంటే సులువు అన్నారు. ప్రతి ఒక్కరూ హిందీలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జీసీ సంతోష్‌కుమార్, రాజేష్‌కుమార్, శ్యామ్‌సుందర సాహు పాల్గొన్నారు.

రోగులు, వైద్యులకు వారధిలా మెడిలాంజ్

సాక్షి, సిటీబ్యూరో: ఉన్న చోట నుంచే వేర్వేరు ప్రాంతాల వైద్య నిపుణుల సేవలను పొందడంలో రోగులకు సహకరించే అనుసంధానిత టెలీకన్సల్టేషన్ వేదిక మెడిలాంజ్ నగరంలో ఏర్పాటైంది. ఎమ్‌క్యూరా మొబైల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎ.ఎస్.రావునగర్‌లో నెలకొల్పిన ఈ లాంజ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్ క్యూరా వ్యవస్థాపక సీఈఓ మధుబాల రాధాకృష్ణన్ మాట్లాడుతూ రోగుల పూర్తి కేస్ షీట్‌ను తయారు చేయడం, ముందస్తు అసెస్‌మెంట్ సేవలు, ఐఓటీ–ఆధారిత తక్షణ పరీక్షలు తదితర సేవల్ని తమ మెడిలాంజ్ అందిస్తుందని తెలిపారు. ఇది వైద్యులకు–వైద్యులకు మధ్య, రోగులకు–వైద్యులకు మధ్య సంప్రదింపులను సులభ సాధ్యం చేయడం ద్వారా అత్యాధునిక వైద్య సేవలు పొందడంలో సంక్లిష్టతను నివారిస్తుందన్నారు. స్థానిక పాలిక్లినిక్స్, మధ్య స్థాయి ఆస్పత్రులకు ఒక వరంలా సమగ్ర వ్యాధి నిర్వహణ లక్ష్యంగా మెడిలాంజ్ పని చేస్తుందన్నారు.

జీవన నైపుణ్యాలపై యువత దృష్టిసారించాలి



మాట్లాడుతున్న మాజీ అదనపు డీజీపీ బాబూరావు

కీసర: యువత జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని మాజీ అదనపు డీజీపీ బాబూరావు అన్నారు. బోగారంలోని హోలీ మేరీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్‌లో జీవన నైపుణ్యాలపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో యువకులు దూసుకెళ్లాలంటే జీవన నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంచుకున్న రంగంలో లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రతిభతో పాటు సమయ స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ అరిమండ సిద్ధార్థరెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎవరికీ ఇబ్బంది కలగకుండా.. పంచాయతీ పాలన



- ప్రత్యేక అధికారుల విధులు, బాధ్యతలపై కలెక్టర్ గౌతమ్
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్పెషల్ ఆఫీసర్లకు శిక్షణ

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం గ్రామ పంచాయతీలను సక్రమంగా నిర్వహించే గురుతర బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉంచిందని, సర్పంచుల కన్నా జాగ్రత్తగా విధులు నిర్వహించి, ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పంచాయతీ నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్న ఉద్దేశ్యంతోనే సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు.

◆ సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 61 గ్రామ పంచాయతీలకు జిల్లా, మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామన్నారు. ప్రత్యేక అధికారులందరూ నూతన పంచాయతీరాజ్ యాక్ట్ 2018పై స్పష్టమైన అవగాహన పొందాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా పర్యవేక్షించాలని ఆయన సూచించారు.

◆ గ్రామాభివృద్ధిలో భాగంగా వివిధ దశల్లో ఉన్న పనులు సకాలంలో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు యువతను అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం చేయాలని కోరారు.

◆ పంచాయతీ రాజ్ చట్టంలో సూచించిన విధంగా క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనులు నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది సమన్వయంతో ప్రజల అవసరాలను తీర్చాలన్నారు. ప్రతి రెండు నెలలకు జరిగే గ్రామ సభలకు ప్రత్యేక అధికారులు అధ్యక్షత వహించి ఆదాయ వ్యయాలపై సమీక్షించాలన్నారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించి సర్పంచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

ఉపాధి హామీలో పనులు ..

ఉపాధి హామీలో భాగంగా గ్రామ అవసరాలకు అనుగుణంగా ఎక్కువ పనులు చేపట్టి, ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ సంబంధించిన 7 రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించబడేలా చూడాలన్నారు. శిక్షణలో పంచాయతీ రాజ్ చట్టం 2018, విధులు, బాధ్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, డీపీవో రమణమూర్తి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధి కారి పద్మజారాణి, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఘట్‌కేసర్: ఇంటి యజమాని మృతితో అనాథలైన పేద కుటుంబానికి సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని బ్రూక్‌బాండ్ కాలనీకి చెందిన కిశోర్ ఇటీవల మరణించడంతో ఇద్దరు కూతుళ్లు, భార్య శైలజ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఎన్‌ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తమ సంస్థ ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు సందర్‌రావు, శ్రీకాంత్, బాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు వేధిస్తున్నారని నిరసన



పోలీస్ స్టేషన్‌లో నిరసన చేపట్టిన మహిపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: కాంగ్రెస్ నాయకుల వేధింపులు, పోలీసులు అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆరోపిస్తూ ఎన్‌ఎఫ్‌సీనగర్ మాజీ ఉప సర్పంచ్ మహిపాల్‌రెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం అర్ధ నగ్న ప్రదర్శనతో నిరసన చేపట్టారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించగా అక్కడ నిరాహార దీక్ష చేపట్టాడు. ఆయనకు మద్దతుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎంపీటీసీ శోభారాణి, బీజేపీ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి హనుమాన్, రామతీర్థ, మాజీ ఉప సర్పంచ్ నరేశ్, జైపాల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సంజీవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాంనాథ్ సంఘీభావం తెలిపారు.

క్రీడాకారులు పోరాటపటిమ కలిగి ఉండాలి



వీబీఐటీ వాలీబాల్ క్రీడాకారులను అభినందిస్తున్న చైర్మన్ గౌతంరావు

ఘట్‌కేసర్: క్రీడాకారులు పోరాట పటిమ కలిగి ఉండాలని విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ) చైర్మన్ డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. హైదరాబాద్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో ఈ నెల 4 వరకు జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నీలో విజేతగా నిలిచిన వీబీఐటీ క్రీడాకారులను మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదువుతో పాటు క్రీడలకు సముచిత స్థానం ఇస్తామన్నారు. కార్యక్రమంలో వీబీఐటీ ప్రిన్సిపల్ శ్రీనివాస్, డైరెక్టర్ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, శివలాల్, మహేశ్, వెంకటేశ్, పాషా ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

మెషిన్ లెర్నింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొనాలి



ముఖ్యఅతిథి ఖద్దూస్‌తో అనురాగ్ విద్యార్థులు

ఘట్‌కేసర్: వాస్తవ ప్రపంచ అప్లికేషన్ అల్గారిథమ్‌లను అర్థం చేసుకోవడానికి విరివిగా మెషిన్ లెర్నింగ్ వర్క్‌షాప్‌లలో పాల్గొనాలని వెల్డిస్ ప్రైవేటు లిమిటెడ్ రిసోర్స్ పర్సన్ లీడ్ డేటా సైంటిస్ట్ అబ్దుల్ ఖద్దూస్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఐఈఈఈ–సీఐఎస్ సహకారంతో మంగళవారం నిర్వహించిన 'డీప్ డైవ్ ఇన్ మెషిన్ లెర్నింగ్'పై నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రొఫెసర్ విజయకుమార్, డీన్ హెచ్‌ఓడీ మల్లికార్జున్‌రెడ్డి సెషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మెషిన్ లెర్నింగ్ ప్రాముఖ్యత, అప్లికేషన్ల గురించి వివరించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు దీపిక, తృప్తి, 125 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ గజమాలతో సత్కారం



మేడ్చల్‌లో దీపాదాస్ మున్షికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి చేపట్టిన చలో సిద్దిపేట కార్ల ర్యాలీకి మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ర్యాలీలో వెళ్తున్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్‌మున్షిని అంబేడ్కర్ విగ్రహం నుంచి జాతీయ రహదారిపై ఊరేగింపు నిర్వహించి వివేకానంద విగ్రహం వద్ద భారీ గజమాలతో సత్కరించారు. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, నియోజకవర్గ నాయకులు తోటకూర వజ్రేష్‌యాదవ్, నక్క ప్రభాకర్‌గౌడ్‌ను సత్కరించారు. మండల మున్సిపల్ నాయకులు రమణారెడ్డి, మల్లేష్‌గౌడ్, చాపరాజు, గర్దాస్ నరేందర్, రంజిత్, సల్ల వెంకటేష్, రేగు రాజు, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ఐసీడీఎస్ సీడీపీవో స్వాతి



జవహర్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో స్వాతి

జవహర్‌నగర్: మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రై సంస్థ సహకారంతో మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని గబ్బిలాల్‌పేట, రాజీవ్‌గాంధీనగర్, శాంతినగర్‌లో కళాజాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో స్వాతి మాట్లాడుతూ.. ప్రతి మహిళ గర్భం దాల్చిన వెంటనే స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. పౌష్టికాహార లోపం లేని పిల్లల ఎదుగుదలకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో క్రై సంస్థ సిబ్బంది మంజుల, సునీల్, సందీప్, అంగన్‌వాడీ టీచర్, క్రాంతి కళాబృందం సభ్యులు వెంకటచారి, ఆంజనేయులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అన్నోజిగూడలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



పోలీసు బందోబస్తుతో కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

పోచారం: అన్నోజిగూడలో సర్వే నంబర్ 3/1లోని ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. డిప్యూటీ తహసీల్దారు సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తుతో కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కూల్చివేసిన చోట పునర్నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇళ్ల కూల్చివేతలపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు బోరున విలపించారు.

రశీదు ఇవ్వని కంప్యూటర్ ఆపరేటర్‌పై ఫిర్యాదు



అదనపు కలెక్టర్‌కు వినతి అందజేస్తూ..

ఘట్‌కేసర్: ఇంటి నంబర్ కోసం చెల్లించిన ట్యాక్స్ డబ్బులకు రశీదు ఇవ్వని మున్సిపల్ కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన బాల్‌నర్సింహ మేడ్చల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు మంగళవారం వినతి అందజేశారు. 200 గజాల స్థలంలో నిర్మించిన ఇంటికి నంబర్ కేటాయించడానికి జూలై 19, 2023న రూ.48,500లు చెల్లించానని లేఖలో తెలిపారు. డబ్బుల రశీదు విషయం అడిగితే స్థానిక కౌన్సిలర్ దగ్గర ఉన్నాయని కాలయాపన చేస్తోందన్నారు. డబ్బులు తీసుకొని రశీదు ఇవ్వని వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరాడు.

పల్లె.. తొలుక్'..

- నేటి నుంచి 14 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు
- 619 గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రగతి కార్యక్రమాలు
- కార్యాచరణ కార్యక్రమాన్ని ఖరారు చేసిన అధికారులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని సర్కారు చెబుతోంది. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 619 గ్రామ పంచాయతీల్లో బుధవారం నుంచి ఈ నెల 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రెండు జిల్లాల కలెక్టర్లు, డీపీఓ, డీఆర్‌డీఏ, ప్రత్యేకాధికారులు, ఎంపీఓలు, ఎంపీడీఓలతో ఇటీవల మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ప్రజలను భాగస్వాములు చేయాలని సూచించారు. సర్పంచులు, పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగనున్నాయి. వీటిలో పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు, మిషన్ భగీరథ సిబ్బంది భాగస్వామ్యాన్ని పంచుకోనున్నారు.

8 రోజుల్లో ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారంపై ప్రత్యేకాధికారులు దృష్టి సారించనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం హైదరాబాద్ నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 619 గ్రామ పంచాయతీల్లో ఎనిమిది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. తొలిరోజు పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తిస్తారు. ఆయా సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించేలా ప్రణాళికలు రచిస్తారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంతో పాటు నీటి సరాఫరాను మెరుగు పర్చడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు.

పనితీరుతో ఉత్తమ పంచాయతీల ఎంపిక..

కలెక్టర్ల ఆదేశాల ప్రకారం కార్యక్రమం చివరి రోజు (ఈనెల 15న) పంచాయతీ కార్యాలయాల్లో పండగ వాతావరణంలో గ్రామసభలు నిర్వహించి చేసిన పనులపై అధికారులు సమీక్షిస్తారు. మద్యపానం, మత్తుపదార్థాలు, గుట్కా వంటి వాటికి యువత దూరంగా ఉండేలా వివిధ రూపాల్లో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోనున్నారు. పనితీరు ఆధారంగా జిల్లాస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీలను ఎంపిక చేస్తారు. ఉత్తమ పనితీరు కనబరిచిన కార్మికులు, గ్రామపంచాయతీలకు కలెక్టర్ల ఆధ్వర్యంలో అవార్డులు అందజేస్తారు.

చేపట్టాల్సిన పనులివే..

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా అవగాహన కల్పించాల్సి ఉంటుంది. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలను తొలగించాలి. ఉపయోగపడని బావులను పూడ్చివేయాలి. వినియోగంలో లేని బోరుబావులను మూసేయాలి. రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచాలి. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలి. దోమలు వృద్ధి చెందకుండా రసాయనాల పిచికారీ చేయాల్సి ఉంటుంది. మురుగు కాల్వల్లో వ్యర్థపు నీరు నిలవకుండా పూడిక తీయాలి. అన్ని ఇళ్లలోనూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించేలా చైతన్యపర్చాల్సి ఉంటుంది.

అన్నివర్గాల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు



లక్ష్మణ్‌కు నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి

శామీర్‌పేట్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి అన్నారు. శామీర్‌పేట్ మండలంలోని అలియాబాద్ చౌరస్తా వద్ద మంగళవారం నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బీజేపీ చేపట్టిన గావ్ చలో అభియాన్ కార్యక్రమం జిల్లాలో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ దేశంలోని అన్నివర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు చేపట్టారని, వందల ఏళ్ల నాటి రామమందిర ఏర్పాటు స్వప్నం ప్రధాని మోదీతో సాకారం అయ్యిందన్నారు. రాష్ట్రంలో వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఏర్పాటు చేసి రాష్ట్ర రూపురేఖలు మార్చారని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్‌గా మంచినీళ్ల లక్ష్మణ్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు హృదయ్‌కుమార్, మండలాధ్యక్షుడు యాదవగిరి, నాయకులు అశోక్, కుమార్‌గౌడ్, లక్ష్మణ్, భాస్కర్, నరేందర్‌గౌడ్, నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువతి మృతదేహం లభ్యం



మేడ్చల్‌రూరల్: చెరువులో గుర్తుతెలియన యువతి మృతదేహం లభ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి డబిల్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లావణ్య తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం డబిల్‌పూర్ గ్రామంలోని పెద్ద చెరువు నీటిలో మృతదేహం తేలుతూ కనబడటంతో స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. 25–30 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మృతురాలి వివరాలు తెలియకపోవడంతో గుర్తుతెలియని యువతి మృతదేహంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలు చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడిందా లేక ఎవరైనా హత్య చేసి చెరువులో పడేసి వెళ్లారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.